# మనసున్న మనిషి

## యర్రంశెట్టి సాయి

"మా ఫ్రెండ్ రాఘవరావొస్తున్నాడోయ్, ప్రభావతీ!" పోస్ట్‌మన్ అందించిన ఉత్తరం చదువుతూ అన్నాడు మోహన్రావు.

సోఫాలో కూర్చుని ఏదో అల్లిక చేస్తున్నదల్లా ఉలిక్కిపడి అతనివంక చూసింది ప్రభావతి.

"ఎవరు? రాఘవరావా?" సర్దుకుంటూ అడిగింది.

"అవును!—నీకు తెలీదులే! యస్సెస్సెల్సీ వరకూ ఇద్దరం మా వూరి హైస్కూల్లోనే చదువుకొన్నాం. నాకు చాలా మంచి స్నేహితుడు! ఇక్కడ ఏదో ఇంటర్వ్యూ వుందట ఎల్లుండి! రేపు ఉదయం వస్తున్నానని రాశాడు."

ప్రభావతి మనసంతా క్షణాల్లో ఆందోళనగా తయారయింది. తనకు తెలిసిన రాఘవరావూ, భర్త స్నేహితుడు రాఘవరావూ ఒకరేనా? ఒకవేళ అతనే అయితే....అయితే

ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్! "భగవంతుడా! అలా జరగనీకు! ఇప్పుడతన్ని చూడటాన్ని నేను భరించలేను. దయచేసి ఇతన్ని నాకు ఇంతకు ముందు తెలీని వ్యక్తి అయ్యేట్లు చూడు...." లోలోపలే భగవంతుని ప్రార్థించింది.

"వాడికి మనఇల్లు తెలుసుకాబట్టి సరాసరి వచ్చేస్తాళ్ళే! రాగానే కొంచెం అతిధి మర్యాదలు చేసి కబుర్లు చెప్తూ కూర్చున్నావంటే ఎలాగో ఒంటిగంటకల్లా నేను డ్యూటీనుంచి వచ్చేస్తాను. అప్పుడు అందరం కలిసి భోజనం చేసేయవచ్చు ఏం?"

"అలాగే...." అన్య మనస్కంగా అంది ప్రభావతి.

"వాడిని చూసి చాలా కాలమయిపోయిందోయ్! పైగా ఈ మధ్యకాలంలో అసలు ఉత్తరాలు కూడ రాసుకోలేదు...." సాయంత్రం వరకూ తన హైస్కూల్ రోజుల గురించి ఏవేవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు మోహన్రావు! ప్రభావతి మౌనంగా 'ఊ' కొడుతూనే ఉంది. భర్తమాటల్ని బట్టి రాఘవరావు—అతనే అయుండాలి! ఇప్పుడు ఏమిటి చేయటం? అతని చూపుల్నుంచీ, అప్పటి సంఘటనల జ్ఞాపకాలనుంచీ, ఎలా తప్పుకోవడం? అతని ఎదురుగ్గా తిరుగుతూ ఏమీ ఎరగనట్లు, అంతకు ముందు తనకూ అతనికీ ఏమీ సంబంధం లేనట్లు ఎలా నటించడం? అదీగాక అదివరలా ఇప్పుడూ అతను చొరవ తీసుకుంటే? వణికిపోయింది ప్రభావతి! అతనంతపని చేస్తాడా? తనిప్పుడు అతని ప్రాణస్నేహితుని భార్య. కనీసం ఆ విధంగానయినా తనని గౌరవంగా చూడడూ?

ప్రభావతికేమీ పాలుపోడం లేదు. పోనీ తను ఇప్పుడే పుట్టింటికి బయల్దేరితే? ఊహూ! సాధ్యం కాని పని అది ఇంత హఠాత్తుగా పుట్టింటికి బయల్దేరాల్సిన అగత్యం ఏమని కల్పించగలదు? ఏదో కాకమ్మకథ చెప్పి నమ్మించడానికి తన భర్తేమీ చిన్నపాపాయి కాదుగా! పైగా మర్నాడు స్నేహితుడొస్తోంటే, ఇంట్లో తను లేకుండా పోడానికి అతనెలా ఒప్పుకొంటాడు?

ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టనేలేదు ఆమెకి. కళ్ళు మూసుకొంటే చాలు రాఘవరావు కళ్ళముందు నిలబడుతున్నాడు. అతన్తోపాటు కస్తూరి, వెంకట్రామయ్యా కూడా గుర్తొస్తున్నారు.

కస్తూరి ఇప్పుడెక్కడుందో ఏంచేస్తోందో! పి.యు.సీ చదివేప్పుడు తామిద్దరూ స్నేహితురాండ్రయారు. తనూ తన ఊరు వదలి బందరు వచ్చి హిందూ కాలేజీలో చేరింది. కస్తూరి కూడా ఉయ్యూరు నుంచి వచ్చి పి.యు.సీ లో చేరింది. నెలరోజుల్లోగానే తామిద్దరకూ ప్రాణస్నేహం అయిపోయింది. కస్తూరి బచ్చుపేటలోనే వాళ్ళ అమ్మమ్మతో ఉండేది. తను బుట్టాయిపేటలో పిన్నిగారింట్లో ఉండేది.

అయినాగాని ఇద్దరూ ఎప్పుడూ తమ ఇంట్లోనో లేక కస్తూరి ఇంట్లోనో ఉండేవారు. రాత్రుళ్ళు కూడా ఇద్దరూ కలిసే చదువుకొనేవాళ్ళు. తమ స్నేహం సంగతి తెలీడంవల్ల ఎవరూ అందుకు అభ్యంతరం చెప్పేవారు కాదు. పిన్ని బాబాయిల దగ్గర కూడా కస్తూరికి చనువెక్కువే! కాలేజీ వాతావరణంలో ఆరునెలలు చాలా సరదాగా గడచిపోయినయ్! సంక్రాంతి సెలవులకు ఇద్దరూ ఊరు వెళ్ళకుండా అక్కడే వుండి చదువుకోవాలని నిర్ణయించుకొన్నారు.

అనుకొన్నట్లే చదువు సాగిపోతోంది.

ఓ రోజు ఇద్దరూ కొత్తగా రిలీజయిన సినిమాకి వెళ్ళారు. తమ వెనుకే తమ కాలేజీ బి.యస్సీ క్లాస్ కుర్రాళ్ళిద్దరు కూర్చుని ఉండటం కనిపించింది. కస్తూరి ఇంటర్వెల్‌లో నాలుగయిదుసార్లు వెనక్కు తిరిగి ఆమె వెనుక కూర్చున్న కుర్రాడి వంక చూడటం తను గమనించింది. ఆ కుర్రాడు కాలేజ్ డే నాడు ప్రదర్శించిన హాస్య నాటికలో హీరో! ఎంతో బాగా నటించాడని అనుకొన్నారు తమ ఆడపిల్లలందరూ!

సినిమా అయిపోయింది.

తామిద్దరూ నడుస్తూ బయల్దేరేరు, కస్తూరి ఇంటివైపు. ఆ కుర్రాళ్ళిద్దరూ తమనే వెంబడించారు.

"నువ్వు అతనివంక అలా చూడబట్టే, ఇప్పుడు వాళ్ళు మన వెంబడి పడ్డారు...." అంది తను.

కస్తూరి చిన్నగా నవ్వింది.

"అలా చూడటం తప్పంటావా" అనడిగింది నెమ్మదిగా.

"భలేదానివే! ముక్కు మొఖం తెలీని మనిషివంక ఎందుకలా చూడటం?"

"ఎందుకేమిటి? అతను అందంగా

లేడంటావా?"

తను ఆశ్చర్యపోయింది ఆమె ధోరణికి!

"అందంగా వుంటే?"

"సరదాగా పరిచయం చేసుకొంటే—బావుండదూ?"

"ఎందుకూ?"

"ఎందుకేముందీ? బాయ్ ఫ్రెండ్ వుంటే చాలా సరదాగా వుంటుంది"


"ఇంకేమయినా వుందా అదేదో హైద్రాబాద్‌లోనా, బొంబాయిలోనూ అయితే ఫరవాలేదు. ఊళ్ళో బాయ్ ఫ్రెండంటే ఊళ్ళో వాళ్ళందరూ వింతజాల్లా మ్యూగి చూస్తారు—మీ ఇద్దరినీ!.."

"అయినా సరే! విద్యార్థి జీవితం, మళ్ళీ మళ్ళీ వస్తుందా ఏం? ఎలాంటి ధైర్యంచేసినా ఇప్పుడే చేయాలి! ...."

"ఏమో తల్లీ! నీ ఇష్టం అల్లరవా లనుకుంటే ఆ పని చేసెయ్!..." అంది తను తప్పించుకొంటూ.

ఆ కుర్రాళ్ళిద్దరూ కస్తూరి ఇంటివరకూ వచ్చి వెనుకకు తిరిగారు. కస్తూరి మరో రెండుమూడుసార్లు అతనివంకే ప్రోత్సాహకరంగా చూపి నవ్వింది.

వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ రాత్రి తనకూ చదవ బుద్ధికాలేదు. కస్తూరి గురించే భయం పట్టుకొంది. ఆ కుర్రాడితో స్నేహం చేస్తుందేమో! ఇద్దరూ, సినిమాలకీ, పార్కులకూ తిరగడం మొదలెడతారు. ఈ పరిచయాలు కేవలం ప్రేమకలాపాలకే దారితీస్తాయి. తరువాత ఏం జరుగుతుందో తను తేలిగ్గా ఊహించుకోగలదు. కాలేజీ అంతా అల్లరి—కస్తూరికి గర్భం—ఆ కుర్రాడి పరారీ—దాని చదువాగిపోడం—గర్భస్రావం—అర్జంటుగా మరొకతనితో వివాహం—అంతే! ఇలాంటి జరిగిన కథలు చాలా వింది తను! అందుకే ఎప్పుడయినా, మనసు చలించినా, ఇలాంటి వాటికి దూరంగా వుంది.



తరువాత వారంరోజులకే వెంకట్రామయ్యకి ప్రేమలేఖ రాసింది కస్తూరి. ఇద్దరూ కాలేజీ ఎగ్గొట్టి 'మాణింగ్ షో' సినిమాకి వెళ్ళారు. కొద్దిరోజులు సినిమాలకెళ్ళడం తరువాత ఇద్దరూ ఏకాంతంగా కలవడంకోసం తపించిపోసాగారు.

"ఏలాగోయ్ ప్రభా! ఏదయినా దారి చెప్పవూ?" అంటూ తన నడిగింది కస్తూరి!

"నాకేమీ తెలీదు! ఇలాంటివి నన్నడక్కు!" అంటూ కోప్పడింది తను! నిజానికి తన మనసులో కస్తూరిమీద ఓ విధమయిన ఈర్ష్య బయల్దేరింది. అంత ధైర్యంగా అది తనకు మనసయిన కుర్రాడితో షికార్లు కొట్టటం, ప్రేమకలాపాలు జరిపే అవకాశం కోసం ఎదుర్చూడటం, తనకు ఉక్రోషాన్ని కలిగించినయ్! నిజానికి తనకీ అలాంటి కోరికలున్నాయ్ గాని, వాటికి రెక్కలు రానీకుండా ఇంతకాలం నుంచీ జాగ్రత్త పడుతోంది!

ఓ రోజు రాత్రి ఇద్దరూ కస్తూరి ఇంట్లో చదువు కొంటూండగా బయట రోడ్డుమీద సైకిల్ బెల్ మ్రోగింది. తనేమీ పట్టించుకోలేదు గానీ, కొద్దిక్షణాల తర్వాత మళ్ళీ అదే విధంగా మోగేసరికి తనకు అనుమానం వచ్చింది. తలెత్తి కస్తూరివంక చూసింది అనుమానంగా.

"అతనే అనుకుంటాను" అంది కస్తూరి నవ్వుతూ.

"ఎందుకలా బెల్ కొడుతున్నాడు?" తనడిగింది ఆశ్చర్యంగా.

"బహుశా ఉత్తరం అందివ్వడాని కనుకొంటాను! ...."

"ఇంత రాత్రప్పుడా?"




"ఇప్పుడయితేనే—ఈ వీధి[లో] ఎవ్వరూ వుండరు!...." అంటూ లేచి నుంచుని వరండాలోకి నడిచింది. తనూ కస్తూరి వెనుకే బయటకు వచ్చింది. టైమ్ పదకొండవుతోం దప్పుడు. ఇంటి చుట్టూ చీకటి! ఇంటికి కొద్ది దూరంగా రోడ్డుమీదున్న ఎలక్ట్రిక్ దీపం కాంతిలో సైకిల్ కనబడింది. వెంకట్రామయ్య తమని చూడగానే రివ్వుమంటూ వచ్చి గేటు ముందాగాడు. కస్తూరి ఒక్క పరుగుతో గేటు దగ్గరకు చేరుకొని మరుక్షణంలో చేతిలో ఉత్తరంతో తిరిగివచ్చింది ఇద్దరూ లోపలికొచ్చి ఉత్తరం చదివారు.

అందాలరాణీ కస్తూరీ,

నీ కోసం ఇప్పుడు మా రూము మీ ఇంటి దగ్గరకు మార్చాము. మీ ఇంటి ఎదురుగ్గా సందులో, కొత్తగా కట్టిన డాబా తెలుసు కదా! అందులో రెండు పోర్షన్ లున్నయ్! రోడ్డు మీద కున్న పోర్షనంత నేనూ, మా ఫ్రెండ్ రాఘవరావు తీసుకున్నాము. రోడ్డువేపున్న వాటా కావడంచేత ఎవ్వరూ అటువేపు చూసే అవకాశంలేదు. కనుక ఇది మనకన్నివిధాలా ఉపయోగపడుతుంది. ఇప్పటిక నీదే ఆలస్యం! రేపు మధ్యాహ్నం నేను కాలేజీకి వెళ్ళటంలేదు. నీకోసం ఇంట్లో ఎదురుచూస్తుంటాను. తప్పక వస్తావు కదూ! అన్నట్లు నీతోపాటూ మీ ఫ్రెండ్ ప్రభావతి గారిని కూడా తీసుకురాకూడదా? మా రూమ్మేట్ రాఘవరావు ఆమెకోసం కలవరిస్తున్నాడు. ఆమెలాంటి అందకత్తెని అతనింతవరకూ ఎక్కడా చూడలేదట! ఆమెతో పరిచయం కలిగితే చాలు తన జన్మసార్థకమైనట్లేనని భావిస్తున్నాడు. ఆమెకి ఎలాగోలా నచ్చజెప్పి మా ప్రార్థన ఆమె చెవినేసి నీతో పాటు రేపు తీసుకురా! మీ ఇద్దరికోసం ఎదురుచూస్తుంటాము.

నీ
వెంకట్రామయ్య.

ఆ ఉత్తరం తనని కూడా సమ్మోహితురాల్ని చేసింది. రాఘవరావుని తను అంతకు ముందు చాలసార్లు గమనించింది. అతను ఎన్నోసార్లు తన కంట్లో పడాలని చేసిన ప్రయత్నాలూ తనకు తెలుసు. తనంటే అతనికి విపరీతమైన ఆకర్షణ ఏర్పడిందని అప్పుడే అనుమానం కలిగింది. నిజంగానే తను కస్తూరికంటే అందంగా ఉంటుంది. అందుకే రాఘవరావు అంతగా తన పరిచయం కోసం ఉవ్విళ్లూరుతున్నాడు.

పోనీ అతనితో పరిచయం చేసుకుంటే? తనకు కలిగే నష్టమేముందీ? తనకీ ఎప్పట్నుంచో ఓ యువకుడితో స్నేహం చేసుకోవాలన్న కోరిక అజ్ఞాతంగా ఉంది. కస్తూరిలాగా తనేం అతనితో సినిమాలకూ, పార్కులకూ తిరగబోవడం లేదుకదా! కేవలం తనక్కావలసింది తనకీ ఓ ప్రియుడున్నాడన్న అనుభూతి! అంతే! అంతకంటే ఎక్కువేమీ తను వాంఛించడంలేదు.

"పోనీ—నువ్ కూడా రేపు రాకూడదటే! రాఘవరావు నీకోసం అంత ఇదయిపోతూంటే" అడిగింది కస్తూరి నవ్వుతూ.

"అమ్మో! ఇంకేమైనా ఉందా?" అంది తను, తన ఆలోచనలు ఆమె కనిపెట్టేసినందుకు భయపడిపోతూ.

"భలేదానివే! అంత భయమెందుకు? ఎవరికయినా తెలుస్తే కదా ఈ విషయాలు! ఎంత సరదాగా వుంటుందో తెలుసా! వాళ్ళ మాటలకు—పై మాటలు విసురుతూ! వాళ్ళు హద్దులు మీరకుండా జాగ్రత్తపడుతూ—నీకెందుకు? రేపొక్క రోజు నాతోరా! నీకు నచ్చకపోతే తరువాత రావడం మానేద్దువ్ గాని...."

"ఏమోనే! నాకు ఇష్టంలేదు ..." ఇష్టంగానే ఉన్నా అంది తను.

"ముందలాగే ఉంటుంది! నాకూ మొదట్లో అలాగే ఉండేది! ఇప్పుడు చూడు, అతన్ని చూడందే ఒక్కరోజయినా ఉండలేను! అతనూ అంతే! నన్ను రోజుకి నాలుగయిదు సార్లయినా ఎక్కడోచోట చూడాలి!...."

మర్నాడు ఇద్దరూ మధ్యాహ్నం కాలేజీకని బయల్దేరి, వెళ్ళకుండా వెంకట్రామయ్య గదికి చేరుకొన్నారు. చాలా పెద్ద కాంపౌండది! ఓసారి గేటు తీసుకొని లోపలకు చొరబడితే ఇక తమన్ని గమనించేవారే ఉండరక్కడ!

వెంకట్రామయ్య, రాఘవరావ్ ఇద్దరూ చాలా ఆకర్షణీయమైన దుస్తుల్లో అందంగా ముస్తాబయి నుంచుని ఎదుర్చూస్తున్నారు తమ కోసం!

తనని చూడగానే రాఘవరావ్ ముఖం ఆనందంతో వెలిగిపోవటం తను గమనించింది.


"నమస్తే.... రండి...." అంటూ ఇద్దరినీ లోపలికి ఆహ్వానించాడు వెంకట్రామయ్య.

ఇద్దరూ గదిలోకి నడిచారు.

కస్తూరి ప్రక్కనే కుర్చీలో కూర్చుంది తను. కొద్దిసేపు వెంకట్రామయ్యా, కస్తూరీ ఏవేవో సరదాగా మాట్లాడుకొన్నారు. తనూ, రాఘవరావూ మాటల్లేకుండా మౌనంగా కూర్చుండిపోయారు.

"వీళ్ళిద్దరూ మాట్లాడరేం?" అంది కస్తూరి వెంకట్రామయ్యతో.

"బహుశా ఏకాంతం కావాలేమో! పద. మనం ఆ గదిలో కెళ్దాం!" అన్నాడతను.




అనడమే ఆలస్యం కస్తూరి అతని వెనుక పక్కగదిలోకి నడిచి తలుపులు దగ్గరగా వేసుకొంది.

తనకేం చేయడానికీ పాలుపోలేదు. అక్కడినుంచి బయటకెళ్ళి పోదామని లేచి నుంచుంది. రాఘవరావ్ కూడ లేచి తన దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"వాళ్ళమాటలు పట్టించుకోకండి: మా వాడికి మాట్లాడటం కూడా తెలీదు!' అన్నాడు నవ్వుతూ.

తను తలవంచేసుకొని కిందకు చూడ సాగింది.

"చూడండి: నేను చాలామంది అమ్మాయిలను చూశాను! కాని మీలాంటి అందమైన అమ్మాయి ఇంతవరకూ తటస్థపడలేదు! మీరు ఈరోజు ఇక్కడకు రాకపోతే నేను మిమ్మల్ని ఎత్తుకొచ్చేవేవాణ్ని! అంతగా పిచ్చెక్కించేశారు నాకు!" తను ఇబ్బందిగా నవ్వింది! మరుక్షణంలో తనని అమాంతం అతని గుండెలకు అదుముకొని కోరికతో ముద్దులు పెట్టుకొంటూ నలిపివేయసాగాడు.

"వదలండి: నాకిలా ఇష్టంలేదు" అంది తను అతన్నుంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ.

"ఊఁ! వదిలితే—మళ్ళీ మనకిలాంటి అవకాశం దొరకదు! కాదనకు...." మరింతగా పొదుపుకొంటూ అన్నాడతను.

అతని స్పర్శ, వత్తిడి తనకూ కోరికని రగిలిస్తోంది! అయినా తన కిష్టంలేని పని అది! అతనిని బలంకొద్దీ దూరంగా నెట్టి తటాలున పక్కగది తలుపు తెరుచుకొని పరుగెత్తింది. అక్కడి దృశ్యం చూస్తూనే సిగ్గుతో కుంచించుకుపోవాల్సి వచ్చింది. కస్తూరీ, వెంకట్రామయ్య అర్ధనగ్నంగా ఒకరిలో ఒకరు లీనమవుతూ కనిపించారు. అంతే! చటుక్కున మళ్ళీ ఇవతలి గదిలో కొచ్చేసింది.

రాఘవరావు మళ్ళీ దగ్గరకొచ్చాడు.

"ఏమయింది?" అనడిగాడు నవ్వుతూ.

"ఛీ పాడు! నన్ను బయటకెళ్ళనీయండి!" అంది తను.

"మీ కిష్టం లేకుండా, మిమ్మల్నేమీ చెయ్యను ప్రభావతిగారూ! వెళ్ళండి!'

తలుపు గొళ్ళెంతీసి బార్లా తెరచి పక్కకు జరిగి నిలబడ్డాడు తను.

తను వడివడిగా నడిచి అక్కడనుంచి బయటపడింది. ఆ తరువాత కస్తూరితో స్నేహం తగ్గించేసింది గానీ, రాఘవరావుతో స్నేహం కలిపింది, అయితే వంటరిగా కలుసుకోడానికి ధైర్యం చాల్లేదు! ఎన్నో ప్రేమ లేఖలు రాసుకొన్నారు. చివరకు కాలేజీ వదిలే ముందు తన ఫోటో అతనికిచ్చింది. అంతే! ఆ తరువాత ఎవరి దారి వాళ్ళదయిపోయింది.

ఇప్పుడు-తిరిగి ఇన్నేళ్ళ తరువాత అతను తారసపడబోతున్నాడు. అతని కివన్నీ ఇంకా గుర్తుంటాయా? ఇంకా అదివరకులాగానే "నిన్నొక్కసారి పొందితే చాలు! నా జన్మ ధన్యమయినట్లే!" అంటాడా? ఏమో! ఎటూ ఆలోచించలేక పోతోందామె.

జ్ఞాపకాల మధ్య నిద్ర యెప్పుడు పట్టేసిందో ప్రభావతికి తెలీలేదు. మెలకువ వచ్చేసరికి అరుదాటింది టైము. అప్పటికే మోహన్రావ్ కంపెనీ కెళ్ళడానికి తయారయిపోయాడు. ప్రతిరోజూ తనీపాటికి కాఫీ, టిఫినూ తయారుచేసి అతని కందించేది.

"ఇవాళ, ఎందుకో అలసిపోయినట్లు పడుకొన్నావ్! అందుకని లేపలేదు" నవ్వుతూ అన్నాడు మోహన్రావ్.

సిగ్గుపడుతూ లేచింది తను.

"ఉండండి! ఒక్క క్షణంలో కాఫీ చేసుకొస్తాను."

"ఊఁ! టైమయిపోయింది! కేంటీన్‌లో తాగుతాలే కాఫీ! కాఫీ, టిఫినూ తయారుచేసి వుంచు! రాఘవరావ్‌గాడికి కావాలిగా ఎలాగూ! ఇంక వెళ్ళిరానా మరి?"

గుండెలు ఝల్లుమన్నాయ్ ప్రభావతికి. ఇంకాసేపట్లో రాఘవరావ్ వస్తున్నాడు! అదీ, తను అతనికి వంటరిగా తారసపడుతుంది. మోహన్రావ్ కంపెనీనుంచి వచ్చేవరకూ—అంటే నాలుగు గంటలు—అతనితో ఈ ఇంట్లో గడపాలి! ఏమిటి చేయటం? ఎలా మాట్లాడటం? మనసు కల్లోలంగా తయారయిపోయింది. త్వరత్వరగా కాఫీ, టిఫినూ చేయడం ముగించి తలాకిట్లోకి వచ్చి నిలబడింది. ఏ క్షణంలోనైనా అతను రావచ్చు! ఆటోరిక్షా రివ్వుమంటూ వచ్చి యింటిముందాగింది. ప్రభావతి చటుక్కున లోపలికొచ్చేసి కిటికీలోనుంచి చూడసాగింది.

అతను దిగి నుంచున్నాడు. కళ్ళజోడు వున్నా యిట్టే గుర్తించేసింది ప్రభావతి! అతనే! అచ్చం అలానే. అప్పటికంటె మరింత అందంగా వున్నాడు. సూట్‌కేస్ తీసుకొని లోపలికి వచ్చాడతను. ప్రభావతిని చూస్తూనే ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయిపోయాడు.

"అరె! మీరా? .... అంటే .... మోహన్‌గాడు చేసుకొంది...."

ప్రభావతి అతనివంక చూడలేకపోతోంది.

"ఆయన కంపెనీకెళ్ళారు. కూర్చోండి! కాఫీ తీసుకొస్తాను...." అనేసి వడివడిగా అక్కడినుంచి వంటింటివేపు నడిచింది.

కాఫీ, టిఫినూ తీసుకొని వంటింట్లోంచి బయటకు రాబోతూ, గడపదగ్గరే అడ్డంగా నడుంమీద చేతులుపెట్టుకొని నిలబడ్డ అతన్ని చూసి ఖంగారుపడి అక్కడే నిలబడి పోయింది.

అతని పెదాలమీద అదే నవ్వు! అదే తీరు!

"బాగుంది! తమాషా చూశారా! మళ్ళీ మనం ఇలా కలుసుకోగలమని మీరెప్పుడేనా అనుకొన్నారా? నాకయితే ఎప్పుడూ నమ్మకం లేదు. మనం తిరిగి కలుసుకొంటామని!...."

"ఊఁ అవును! .... ముందు మీరు టిఫిన్ తీసుకోకూడదూ? చల్లారిపోతుంది." సందర్భం మార్చడానికి విశ్వప్రయత్నం చేస్తూ అంది.

"ముందు మీరీ సంగతి చెప్పండి! ఈ మధ్యలో నే నెప్పుడేనా గుర్తుకొచ్చానా మీకు?" ప్రభావతికేం చెప్పాలో పాలుబోడం లేదు.

"అవును!....అ....ం....చే....అదే.... ఎప్పుడైనా .... అసలు నాకు మతిమరపు ఎక్కువ...." తడబడుతూ అనేసింది.

"భలేవారే! నేనుమాత్రం మిమ్మల్ని గుర్తు చేసుకోని రోజు లేదు! ఎప్పుడూ యెక్కడ ఏ అమ్మాయిని చూసినా తక్కున మీరు గుర్తుకొచ్చేవారు! నిజంగా నాకిప్పుడు యెంత ఆనందంగా వుందో తెలుసా? ఇలా మిమ్మల్ని కలుసుకోడం నా అదృష్టంగా అనుకొంటున్నాను. అసలు కాలేజీ తెరచిం తర్వాత మిమ్మల్ని కలుసుకోడానికి యెంతో ప్రయత్నించాను. కస్తూరి నడిగి మీ అడ్రస్ తీసుకొన్నాను. కానీ, దేముడు మన మధ్య గోడ కట్టేస్తే మీరెలా కనబడతారు?"

ప్రభావతి అతని ప్రక్కనుంచే నడిచి హాల్లో టేబుల్‌మీద కాఫీ, టిఫినూ వుంచింది. ఆమెవెనుకే హాల్లోకొచ్చాడు రాఘవరావ్.

"మీరు అప్పటికంటె యింకా చాలా అందంగా వున్నారిప్పుడు. తెలుసా?"

"ఒహ్! అవునా? అన్నట్లు ఆయనొచ్చే వేళవుతోంది, వంటపని చూస్తాను!"

"ఆగండాగండి! వాడొచ్చేలోగానే మనం మాట్లాడుకోవాలి! వంటకు తొందరేముంది? ఇలా దగ్గరకొచ్చి కూర్చోండి! మీరు నమ్ముతారో, నమ్మరో గాని ఇంకా మీరు రాసిన ఉత్తరాలు, మీ ఫోటో, అన్నీ నా దగ్గరున్నాయ్! నే నెక్కడికెళ్ళినా అవి నా వెంట వుండాల్సిందే! కనీసం రోజుకోసారయినా అవి చదువుకొంటూ గడపందే నాకేమీ తోచదు!"

ప్రభావతి ఉలిక్కిపడింది.

అతనికి తనమీద కోరిక వుంది. పరోక్షంగా తనని భయపెడుతున్నాడు. తనిప్పుడు అతనికి లొంగకపోతే అవన్నీ భర్తకు చెపుతానని హెచ్చరిస్తున్నాడు. ఇదే అతని మాటల్లోని అంతరార్థం. లేకపోతే అవన్నీ తనతో చెప్పాల్సిన అవసర మేముందీ?


"అసలు మావాడి పెళ్ళి, శుభలేఖలో మీ పేరు చూడగానే నాకు అనుమానం వచ్చింది


# ఏ 4 పుస్తకాలు కొన్నా ఒక పుస్తకం ఉచితం!




| | | |
|---|---|---|
| రాగధార ..... | విమలారామం ... | 10.00 |
| వసుంధర ... | ,, ... | 7.50 |
| తమసోమా... | పి.రాజగోపాలనాయుడు | 7.50 |
| రాజకీయం ..... | ,, ... | 6.00 |
| నత్తగుల్లలు .... | తులసీకృష్ణ ... | 7.50 |
| ఇదిమాతరం కథ ... | బి.కృష్ణవేణి ... | 6.00 |
| శమంత-హేమంత .. | పి.వి.ఆర్.శివకుమార్.. | 5.00 |
| క్షమార్పణ ..... | గంటివెంకటరమణ .. | 6.00 |
| ఏటిఒడ్డు .... | ,, ... | 6.00 |
| మీరు-మీ ఆరోగ్యం | డా॥యలమంచిలి శివాజీ M.B.,B.S | 10.00 |
| గంగ ..... | యార్లగడ్డ, సరోజినీదేవి | 6.00 |
| ప్రతిఫలం ..... | ,, ... | 8.00 |
| భవబంధాలు .... | ,, ... | 6.50 |
| రాగవీచికలు .... | ఏ.వి.సీతారామమూర్తి .. | 6.00 |
| భవతీ భిక్షాందేహి ... | ఇల్లిందల సరస్వతీదేవి | 7.50 |
| నీబాంచను కాల్మొక్తా.. | ,, ... | 11.00 |

నవయుగ బుక్ సెంటర్
ఏలూరురోడ్ ✻ విజయవాడ-2




కాని, ప్రభావతి అంటే మీరనుక్కరే కాదు గదా అని ఆలోచన వచ్చి ఆ అనుమానం, త్రోసిపుచ్చేశాను."

ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంది ప్రభావతి.

"కాసేపు పడుకొంటాను. రాత్రంతా బస్ ప్రయాణం కదా! కంటిమీద కునుకు లేదు. వెధవ బస్! వెనక సీట్లో కూర్చుంటే కూర్చో కూడదు!"

ప్రభావతి చటుక్కున కుర్చీలోనుంచి లేచింది.

"పదండి! ఆ గదిలో విశ్రాంతి తీసుకోండి. మీరు లేచేవరకి భోజనం సిద్ధం చేస్తాను!" అతన్నుంచి తప్పించుకోడానికి అంతకంటె మరో మార్గం లేదనిపించిందామెకి.

"అదేం కుదరదు. దొరక దొరక్క ఇన్నాళ్ళకు దొరికి, ఇప్పుడలా దూరంగా పారిపోతావేమిటి! నే నూరుకోను! రండి నాతో...." అంటూ గదిలోకి నడిచాడతను.

ప్రభావతి వణికిపోయింది. అతని కళ్ళలో అదివరకటి కోరిక కదులుతూనే వుంది. ఇప్పుడిక తనను దేముడుకూడా అతన్నుంచి రక్షించలేడు. తను అతనిని ప్రతిఘటించే పరిస్థితిలో ఎంతమాత్రం లేదు.

"అలా మంచుండిపోయారేంటి రండి! మీ ఫోటో మోహన్‌గాడు చూస్తే వాడికి మతి పోతుందనుకోండి అప్పటి మీ రూపం చూసి."

ప్రభావతికి కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్! మతి పోతుంది! నిజమే! అంతే కాదు! ఈ ప్రభావతి సంసారం సర్వనాశనమైపోతుంది! వీల్లేదు! అలా జరక్కూడదు! రాఘవరావు క్కావలసిందేమిటో అతని మాటల్నిబట్టి స్పష్టంగా తెలుస్తూనేవుంది. అతని క్కావలసింది తను! తన శరీరం! అంతే! తను అందుకు వొప్పుకుంటే అతను తన ఫోటో భర్తకి చూపించడు. తను అతనికి వ్రాసిన ప్రేమలేఖలు, భర్తకి కానుకగా యివ్వడు. తనకిప్పుడు ముఖ్యమయింది తన సంసారం! పదేళ్ళు తను భర్తతో సుఖంగా కాలం గడపాలంటే, తన జీవితం వీధిన పడకుండా వుండాలంటే, తను రాఘవరావుతో గడపాలి! అతనికి సుఖాన్ని ఇవ్వాలి అంతే! అంతకుమించి గత్యంతరం లేదు!

"భగవంతుడా! నువ్వు మోసగాడివి! పరిస్థితుల్ని అతి లాఘవంగా సృష్టించి మనుషుల్ని తోలుబొమ్మలు చేస్తుంటావ్!"

"రాఘవరావ్‌గారూ!" అతని దగ్గరకు నడిచింది ప్రభావతి.

"మీ క్కావలసింది నా శరీరమే కదా! తీసుకోండి! ఆలస్యం చేయకండి. యౌవనపు మత్తులో చేసిన పొరబాటుకు మూల్యం కావాలంటున్నారు కదా! తీసుకోండి! లేకపోతే, నేను మీకు రాసిన ఉత్తరాలు నా భర్తకు చూపిస్తారు! ఇంకా చాలా చాలా కల్పించి చెప్తారు. నా జీవితంలో నిప్పులు పోస్తారు. అంతే కదూ! అందుకే ఈ నిర్ణయాని కొచ్చాను" అతనిమీదకు వరిగిపోతూ అంది ప్రభావతి.

రాఘవరావ్ ఛటుక్కున ఆమెను రెండు చేతుల్తోనూ ఆపి తను దూరంగా జరిగాడు.

"ప్రభావతిగారూ! ఏమిటదీ? మీరు మాట్లాడే మాటలకేమయినా అర్థం వుందా? నేను మిమ్మల్ని కోరానా? మీరు వప్పుకోకపోతే పాతవిషయాలు మీ భర్తకు చెబుతానని బెదిరించానా? భలేవారు మీరు! ఎలా ఊహించుకొన్నారవన్నీ? మీ రిప్పుడు నా ప్రాణస్నేహితుని భార్య అన్నసంగతి మర్చిపోయాననుకొన్నారా? మా ఇద్దరి సంబంధం సంగతి మీకు తెలీదనుకుంటాను. వాడి భార్య నాకు చెల్లెలు! నా భార్య వాడికి చెల్లెలు! కేవలం డైలాగుల మాట్లాడటం కాదు! మే మిద్దరం అలాంటి బాంధవ్యంతో పెరిగాము! చాలా బావుంది! మీరు అదివరకు పరిచయమున్నవారు గనుక అలా చనువుగా మాట్లాడుతున్నాను! హఠాత్తుగా మిమ్మల్నిక్కడ చూసిన షాక్‌నుంచి తేరుకోడానికి, మన మధ్య చక్కటి వాతావరణాన్ని సృష్టించడానికి అనువుగా వుంటుందని, పాత పరిచయాన్ని గుర్తుకి తెస్తున్నాను! వెళ్ళమ్మా! వెళ్ళు! వంట కానీ! పాత జ్ఞాపకాలు చెరిపేయ్! ఆ జ్ఞాపకాలు ఆ వయసువి! యౌవనం చేయించిన అల్లరి పనులవి! ఈ రాఘవరావ్‌గాడు విలన్ కాదమ్మా, ఓ మనసున్న మనిషి! నిజానికి నువ్ రాసిన ఉత్తరాలు లేవు! నీ ఫోటోకూడ లేదు నా దగ్గర."

ప్రభావతి గదిలోంచి పరుగుతో బయట కొచ్చేసింది. ఆమె కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్! మనసు సంతోషంతో ఊగిసలాడింది. "ఈ మనిషి మనిషి కాదు! దేముడే" అనుకొంది లోలోపలే!

